

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి, కలెక్టర్, ఎస్పీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి క్రైం/సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలన అందరి బాధ్యత అని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. అవినీతి నిరోధకశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిర్మూలన వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందుకు సంబంధించి పోస్టర్‌ను జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర, కలెక్టర్ పి.ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ తమ కార్యాలయాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి నిర్మూలన అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుతమైన సేవలందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో అవినీతి నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు భయం లేకుండా అవినీతి ఘటనలను వెల్లడించాలన్నారు. జిల్లాలో ఏ ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగినా, డిమాండ్ చేసినా వెంటనే అవినీతి నిరోదక శాఖ టోల్ ఫ్రీ నంబరు 1064 లేదా అవినీతి నిరోధకశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంగారెడ్డి అదనపు ఎస్పీ రఘునందన్ రావు, ఏసీబీ డీఎస్పీ కె.సుదర్శన్, సీఐ ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులకు
కంట్రోల్ రూమ్, హెల్ప్‌డెస్క్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఎన్నికల ఫిర్యాదులకు ప్రజలు వినియోగించుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఫిర్యాదులు, సందేహాలకు ప్రజలు కంట్రోల్ రూమ్ నంబర్ 08455-276155, హెల్ప్ డెస్క్ నంబర్ 8125352721ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

లెక్కలు పక్కాగా ఉండాలి

టేక్మాల్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులు ఖర్చులకు సంబంధించిన లెక్కలను అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలని వ్యయ పరిశీలకులు జుల్ఫీ తెలిపారు. టేక్మాల్‌ని రైతువేదికలో సర్పంచ్ అభ్యర్థులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్,వార్డు సభ్యులు నూతన అకౌంట్ ద్వారానే ఖర్చులు చేయాలని సూచించారు. నియమవళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈశ్వరీబాయి జయంతి
వేడుకల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక సేవకురాలు, రాజకీయవేత్త, స్వర్గీయ ఈశ్వరీయి 107వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈశ్వరీబాయి కుమార్తె మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు గీతారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గీతారెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు సీతక్క, వివేక్ నిర్మలజగ్గారెడ్డిని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. దళితులు, మహిళల అభ్యున్నతి కోసం ఈశ్వరీబాయి చేసిన కృషిని సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని నిర్మలాజగ్గారెడ్డి కొనియాడారు.



ఈశ్వరీబాయి జయంతి వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిని సన్మానిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు సీతక్క, వివేక్, మాజీ మంత్రి గీతారెడ్డి తదితరులు



కోహీర్‌లో చలి కాచుకుంటున్న మహిళలు

మళ్లీ.. చలి

కోహీర్‌లో 10 డిగ్రీలు
మరో పది రోజులు ఇదే తీవ్రత

కోహీర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో మళ్లీ చలి పెరిగింది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. గత నెలలో 13 నుంచి 22 వరకు సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదైన విషయం తెలిసిందే. ఆ తరువాత తుఫాను ప్రభావంతో చలి తీవ్రత తగ్గింది. శుక్రవారం నుంచి శీతల గాలుల ప్రభావం మళ్లీ మొదలవడంతో చలి తీవ్రత పెరుగుతున్నది. ఉమ్మడి జిల్లాలోనే అత్యల్పంగా కోహీర్ మండలంలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట జిల్లా అంగడికిష్టాపూర్‌లో 10.6 డిగ్రీలు, మెదక్ జిల్లా నార్లాపూర్‌లో 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న పది రోజులు శీతలగాలుల ప్రభావంతో చలి తీవ్రత పెరుగుతుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది డిసెంబరులో మరింత ఎక్కువ చలి ఉంటుందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రతలు..

సంగారెడ్డి జిల్లా: కోహీర్ 10, ఝరాసంఘం 10.6, న్యాల్‌కల్ 10.6, ఆందోల్ 11.2, నల్లవల్లి 11.2, దిగ్వాల్ 11.5, కడ్పల్ 11.7, నిజాంపేట్ 11.8, రామచంద్రాపురం 11.8, రాయికోడ్ 11.8, మొగుడంపల్లి 11.8, నారాయణఖేడ్ 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి

మెదక్ జిల్లా: నార్లాపూర్ 11.2, దామరంచ 11.5, వెల్దుర్తి 11.6, మనోహరాబాద్ 11.6, సర్దన 11.8, వాడి 11.8, బుజరంపేట్ 11.9, శివ్వంపేట్ 11.9 నాగపూర్ 12.1 డిగ్రీలుగా నమోదయ్యాయి.

'మనీ'ఫెస్టో..!

కోతులను తరుముతాం.. కుక్కలను పట్టిస్తాం

ఆలయాలు నిర్మిస్తామని కుల సంఘాలకు ప్రమాణాలు

పెళ్లిళ్లకు పుస్తెమట్టెలు, శుభ, అశుభ కార్యాలకు బియ్యం..

ఉచితంగా పంచాయితీలు చెబుతామనీ ప్రచారం

సొంత మేనిఫెస్టోలతో ప్రజల చెంతకు అభ్యర్థులు

అభివృద్ధి కంటే వినూత్న హామీలకే ఆదరణ

ఎన్నికల్లో గెలుపు కోసం కొండ మీది కోతినైనా పట్టి తెస్తామని ఒకప్పుడు హామీ ఇచ్చేవారు... ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల్లోనూ వానరాల అంశమే ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. కోతులు, వీధి శునకాల బెడద తప్పిస్తామనేదే పలు గ్రామాల్లో అభ్యర్థుల ప్రధాన హామీ. ఒకప్పుడు అభివృద్ధి పనులు చేయిస్తామనే హామీలతోనే ప్రచారం కొనసాగేది. కానీ ఈ ఎన్నికల్లో విభిన్నమైన హామీలతో ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రజల సమస్యలను అభ్యర్థులు ప్రస్తావిస్తూనే... 'ఉచిత' హామీలను గుప్పిస్తున్నారు.



సంగారెడ్డి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. తొలి విడత ఎన్నికలకు 3 రోజులు మాత్రమే సమగయం మిగిలి ఉంది. ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో చాలా గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉంది. ప్రతీ రోజు ఎక్కడో ఒకదగ్గర కుక్కల దాడుల సంఘటనలపై వార్తలు వినిపిస్తున్నాయి. ఏటా వేల సంఖ్యలో కుక్కకాటు బాధితులు ఉంటున్నారు. వీటికి తోడు కోతల బెడదా ఎక్కువైంది. దీంతో సర్పంచ్, వార్డు అభ్యర్థులు తమ ప్రచారంలో కుక్కలు, కోతలును తరిమికొడతామని హామీలు ఇస్తున్నారు.

వినూత్నమైన హామీలు

- రామాయంపేట మండలం ధర్మారం, అక్కన్నపేట గ్రామాల్లో తమను గెలిపిస్తే కోతుల బెడద తీరుస్తామని అభ్యర్థులు బాండ్‌పేపర్ రాసిచ్చారు.
- వెల్దుర్తిలో సర్పంచ్ అభ్యర్థి తనను గెలిపిస్తే కుక్కలు, కోతులను పట్టిస్తానని హామీ ఇస్తున్నాడు.
- చేగుంట, నార్సింగి మండలాల్లోనూ ప్రధానంగా కుక్కలు, కోతుల బెడద గురించే

మిగతా 7వ పేజీలో..



రోడ్డెక్కిన మొసలి..

6

ఓటు పడకుండానే..

ఉమ్మడి జిల్లాలో ఏకగ్రీవాల జాతర

పలు జీపీలు, వార్డుల్లో ఒక్కో నామినేషన్ దాఖలు

అభ్యర్థుల ఉపసంహరణతో మరికొన్ని..

సన్మానాలు, అభినందనలతో

గ్రామాల్లో పండగ వాతావరణం

7

కుల సంఘాల కటాక్షం కోసం..

సంఘాల నేతలు, పెద్దల అభ్యర్థుల సంప్రదింపులు

కమ్యూనిటీకి అవసరమైన సామగ్రి కొనిస్తామని,

ఆలయాలు కట్టిస్తామని హామీ

నారాయణఖేడ్ నియోజకవర్గంలో పలు గ్రామ

పంచాయతీలు ఏకగ్రీవం

7



సర్పంచ్‌ల వేలం
ప్రజాస్వామ్య విరుద్ధం

రాష్ట్ర ప్రభుత్వం వద్ద పైసలు లేవు

కేంద్రం ఇచ్చే నిధుల కోసమే ఎన్నికలు

బీజేపీ వారిని గెలిపిస్తే రూ.25లక్షలు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

7



బాలికల ఉన్నత విద్యకు బాసట

కస్తూర్బాల్లో నీట్, ఐఐటీ, క్లాట్‌కు ఉచితశిక్షణ
జిల్లా వ్యాప్తంగా మూడు కేజీబీవీల ఎంపిక

మెదక్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సమగ్రశిక్ష ఆధ్వర్యంలో కొనసాగుతున్న కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో చదివే విద్యార్థినులకు ఉన్నత విద్యావకాశాలు దక్కేలా ప్రభుత్వం ముందడుగు వేసింది. ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చేరేలా నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాకు మూడు చొప్పున కేజీబీవీలను యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (వైఐఐఓఈ) కేంద్రాలుగా ఎంపిక చేసింది. జిల్లాలోని మూడు కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో నీట్, ఐఐటీ, క్లాట్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉన్నత విద్యాసంస్థల్లో చేరేందుకు రూ. లక్షలు చెల్లించి శిక్షణ తీసుకుంటారు. అలాంటి అవకాశాన్ని కేజీబీవీల్లో చదివే విద్యార్థినులకు ఉచితంగా అందించాలనే సంకల్పంతో ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన మూడు కేజీబీవీల్లో నీట్, ఐఐటీ, క్లాట్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నాం. నిష్ణాతులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారు. ఈ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ర్యాంకులు సాధించాలి.

-విజయ, మెదక్ జిల్లా విద్యాధికారి

శిక్షణ ఇలా...

ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఎంబీబీఎస్‌లో చేరేందుకు నీట్, ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు ఐఐటీ-జేఈఈ, న్యాయవాదవృత్తి చేపట్టేందుకు క్లాట్‌కు సన్నద్ధం చేయనున్నారు. ఇందుకోసం ప్రతీ శని, ఆదివారాల్లో పాఠశాల ముగిసిన తర్వాత అందుబాటులో ఉన్న నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో కేజీబీవీకి ఫర్నిచర్‌తోపాటు 40 కంప్యూటర్లు అందించి ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇస్తారు. నీట్, ఎప్‌సెట్, ఐఐటీ-జేఈఈ, క్లాట్ అధ్యయన సామగ్రి కోసం నిధులు కేటాయించారు. నిపుణుల ఎంపిక, ఒత్తిడి నివారణకు సైకాలజిస్టు నియామకం చేపట్టాల్సి ఉంది. ఒక్కోదానికి రూ.3.65 లక్షలు మంజూరయ్యాయి. మెదక్ జిల్లావ్యాప్తంగా మొత్తం 19 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. మెదక్ కేజీబీవీలో ఐఐటీ-జేఈఈ, చిప్పల్‌తుర్తి కేజీబీవీలో నీఈట్, అల్లాదుర్గం కేజీబీవీలో నీట్ ఉచిత శిక్షణ ఇస్తారు.

శత శాతం పోలింగ్‌కు కృషి
మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ నమోదయ్యేలా అధికారులు కృషిచేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శత శాతం ఓటింగ్ సాధించిన గ్రామాలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. మొదటి విడత పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది ఒకరోజు ముందుగానే డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి స్పెషల్ క్లాసును పరిశీలించారు.



స్పెషల్ క్లాసును పరిశీలిస్తున్న కలెక్టర్

ఏకగ్రీవ పంచాయతీల్లోనూ ఎన్నికల కోడ్ అమలు

మెదక్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏకగ్రీవంగా పాలకవర్గాలను ఎన్నుకున్న గ్రామాల్లో పోలింగ్ లేకపోయినా.. ఎన్నికల షెడ్యూల్ పూర్తయ్యే వరకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉటుందని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ వెల్లడించారు. ఈ నెల 11, 14, 17 తేదీల్లో గ్రామ పంచాయతీ ఎన్నిలకు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తుందున చివరి దశ ముగిసేవరకు జిల్లావ్యాప్తంగా కోడ్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు.

లెక్క తేలింది.. గుర్తు దక్కింది

మూడో విడతకు ముగిసిన నామినేషన్ల పరిశీలన
బరిలో నిలిచేవారి జాబితా ప్రకటించిన అధికారులు
అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

మండలం	జీపీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
నారాయణఖేడ్	47	315	394	837
కంగ్టి	33	184	280	546
కల్హేర్	15	123	134	354
మనూరు	22	139	184	399
నాగల్‌గిద్ద	33	158	258	451
నిజాంపేట	18	93	152	292
సిర్గాపూర్	28	140	226	409
న్యాల్‌కల్	38	194	332	703

నారాయణఖేడ్/మనూరు/కంగ్టి/కల్హేర్/నాగల్‌గిద్ద/న్యాల్‌కల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మూడో విడతలో భాగంగా ఈ నెల 17న జరిగే పంచాయతీ ఎన్నికల్లో పోటీలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్ డివిజన్‌లోని నారాయణఖేడ్, నిజాంపేట్, మనూరు, నాగల్‌గిద్ద, కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్ మండలాలతో పాటు జహీరాబాద్ డివిజన్‌లోని న్యాల్‌కల్ మండలానికి సంబంధించి నామినేషన్ల లెక్క తేలింది. చివరి రోజైన శుక్రవారం పెద్దఎత్తున అభ్యర్థులు తరలిరావడంతో టోకెన్లు ఇచ్చి, శనివారం తెల్లవారుజాము వరకు నామినేషన్లు స్వీకరించారు. 234 గ్రామ పంచాయతీల్లో సర్పంచులకు 1,347 మంది, 1,960 వార్డులకు 4,001 మంది నామినేషన్లు దాఖలుచేశారు. ఏడు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. స్క్రూటినీ అనంతరం నారాయణఖేడ్ మండలం జుజాల్‌పూర్‌లో రెండు వార్డులు, కిషన్‌నాయక్ తండా, పీర్ల తండా, కొండాపూర్ తండాల్లో ఒక్కో నామినేషన్ తిరస్కరణకు గురైంది. సిర్గాపూర్ మండలంలో ఒక వార్డు, కల్హేర్‌లో ఒక వార్డు, మనూరులో ఒక సర్పంచ్ అభ్యర్థి, ఒక వార్డు, నాగల్‌గిద్ద మండలంలో రెండు వార్డు సభ్యుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. న్యాల్‌కల్, నిజాంపేట మండలాలకు సంబంధించి రాత్రి 8 గంటల వరకు వివరాలు ప్రకటించలేదు.

మెదక్ జిల్లాలో..

వెల్దుర్తి/నర్సాపూర్/చిన్నశంకరంపేట/తూప్రాన్/మనోహరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలంలో 23 గ్రామ పంచాయతీలకు 107, 200 వార్డులకు 429 మంది నామినేషన్లను దాఖలు చేశారు. ఒక్క నామినేషన్ కూడా తిరస్కరణకు గురికాలేదు.

నర్సాపూర్ మండలంలో 35 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 183, 282 వార్డులకు 336 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

చిన్నశంకరంపేట మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో రెండు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన గ్రామాల్లో సర్పంచ్ 185 మంది నామినేషన్లు వేశారు.

తూప్రాన్ మండలంలో ఎన్నికలు జరగనున్న 14 గ్రామ పంచాయతీల్లో సర్పంచు 40, 114 వార్డులకు 279 మంది పోటీలో నిలిచినట్లు అధికారులు వెల్లడించారు. ఏడుగురు సర్పంచ్, 18 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

మనోహరాబాద్ మండలంలోని 17 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 63 మంది, 148 వార్డులకు 394 మంది బరిలో నిలిచినట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు.



చిన్నశంకరంపేట: మండల కేంద్రంలోని నామినేషన్ల కేంద్రం వద్ద గుర్తుల ప్రకటన కోసం వేచి ఉన్న అభ్యర్థులు

తాళాలు పగులగొట్టి చోరీ

మాసాయిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాసాయిపేటలో 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న మూడు దుకాణాల తాళాలు పగలగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. చేగుంట ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేటలోని వ్యవసాయ ఆగ్రో కేంద్రానికి సమీపంలోని మరో రెండు దుకాణాల తాళాలు పగులగొట్టి 14 వేల రూపాయలు కొంత కిరణా వస్తువులను దొంగలు చోరీ చేశారు.

ప్రజా రక్షణలో హోంగార్డుల సేవలు అనిర్వచనం

- అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు
- త్వరలో నియామకాలు
- రైసింగ్ డేలో సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



పరేడ్ మైదానంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్లకు ఏ మాత్రం తీసిపోకుండా హోంగార్డులు తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. హోంగార్డుల రైసింగ్ డే సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం రైసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా హోంగార్డుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హోంగార్డులకు, రాజీవ్ ఆరోగ్య శ్రీ మెడికల్ సర్వీసుల కోసం, అర్హత కలిగిన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరుపై పరిశీలన కొనసాగుతోందని, త్వరలో కొత్త హోంగార్డు నియామకాలు చేపట్టడానికి సన్నహకాలు జరుగుతున్నాయని అన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహకారంతో 33 లక్షల హెల్త్ కవరేజ్ అందించబడుతోందని వివరించారు. పోలీస్ సిబ్బందితో సమానంగా రైన్ కోట్, ఉలెన్ జాకెట్ వంటి అవసరమైన సామగ్రి అందించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన హోంగార్డులకు రివార్డు ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్ రావ్, ఎఆర్ డిఎస్పీ నరేందర్, ఆర్‌ఐలు రామారావ్, డానియెల్, రాజశేఖర్ రెడ్డి, సంగారెడ్డి పట్టణ సిఐ రాము నాయుడు, డీసీఆర్బీ సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన సేవలు వీరికే సాధ్యం

మెదక్ అర్బన్ : ప్రజా రక్షణలో హోం గార్డుల సేవలు అనిర్వచనమని, సమర్థమంతమైన సేవలు వీరికే సాధ్యమని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో 63వ హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను అత్యంత ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. ఈవేడుకులకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..హోంగార్డు వ్యవస్థ 1946లో ప్రారంభమై.. దేశ వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో విశిష్టమైన సేవలందిస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరుగా ఇద్దరు మహిళల ఆత్మహత్య

- అత్తింటి వేధింపులు తాళలేక..

సిద్దిపేట రూరల్, /దుబ్బాక, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఒకరు, అత్తింటి వేధింపులు తట్టుకోలేక మరొకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అత్తింటి ఆరాళ్లు తాళలేక శనివారం తన ఇంటిలోనే ఉరేసుకొని గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల సుష్మ(32)కు దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో వ్యవసాయం చేసే పెద్దోళ్ల శ్రీకాంత్‌తో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా భర్త, అత్త, మామల నుంచి పలు రకాలుగా వేధింపులు ఎక్కువయ్యాయి అంటూ సుష్మ వారి తల్లిదండ్రుల వద్ద తరచూ వాపోయేది. దీంతో తల్లిదండ్రులు ఆమెకు తరచుగా నచ్చచెప్పేవారు. ఈ క్రమంలో శనివారం సుష్మ తిమ్మాపూర్‌లోని తన ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని గుర్తించిన ఆమె కుటుంబ సభ్యులు సుష్మ పుట్టింటి వారికి సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక 100 పడకల ఆసుపత్రికి తరలించారు. తమ కుమార్తె మృతికి అల్లుడు శ్రీకాంత్, అత్త ఎల్లవ్వ, మామ బాబుపై తమకు అనుమానం ఉందంటూ మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో ..



కనకవ్వ (ఫైల్)

కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నారాయణరావుపేట మండలం కోదండరావుపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు, సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొంగురం కనకవ్వ (55)కు ముగ్గురు కొడుకులు , రెండో కొడుకు కొన్ని సంవత్సారాల క్రితం చనిపోయాడు. ముడు నెలల నుంచి వారి ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో పలు మార్లు మనస్తాపంతో ఉండేది. శుక్రవారం రాత్రి కనకవ్వ భర్త ఇంటికి వచ్చే సరికి తలుపులు వేసి ఉండడంతో ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో చిన్న కొడుకు, గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఇంటి పైకి ఎక్కి ఇంట్లోకి దిగి చూసేసరికే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని చనిపోయి ఉంది. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, రూరల్ ఎస్సై రాజేష్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

తూప్రాన్/వెల్దుర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఇరు కుటుంబాల మధ్య గొడవకు దారి తీసింది. దీంతో సదరు మహిళ అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. యథాప్రకారం అతనిని కలిసేందుకు వచ్చిన మహిళ గొంతు నులిమి చంపేశాడు. పోలీసులు రంగ ప్రవేశం చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం పెద్దాపూర్‌లో వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలను తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ విలేకరులకు వెల్లడించారు. వెల్దుర్తి మండలం మెల్లూరు పంచాయతీ పరిధి పెద్దాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో చనిపోయి కనిపించింది. బుధవారం హత్య జరగగా, శుక్రవారం పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. సీఐ రంగ కృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజు విచారణ చేపట్టారు. చనిపోయిన మహిళకు అదే గ్రామానికి చెందిన దార మల్లేశ్(35)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇద్దరు ఒకే ఇంట్లో ఉండగా, మహిళ కుటుంబ సభ్యులు పట్టుకున్నారు. ఈ క్రమంలో పెద్దలు మలేశ్‌ను హెచ్చరించినప్పటికీ పద్ధతి మారలేదు. ఈ విషయమై ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. ఈ నెల 3న సదరు మహిళ, మల్లేశ్‌లు గ్రామ శివారులో కలుసుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామాట పెరిగి గొడవ జరిగింది. తన మాట వినడం లేదని ఆగ్రహించిన మల్లేశ్.. ఆమె గొంతు నులిమి చంపేసి.. అక్కడి నుంచి వెళ్లిపోయాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డుపైకి భారీ మొసలి

- సురక్షితంగా బంధించి తీసుకెళ్లిన అధికారులు



వాహనంలో మొసలిని తీసుకెళ్తున్న ఫారెస్ట్ అధికారులు

వట్‌పల్లి, డిసెంబరు(ఆంధ్రజ్యోతి):సంగారెడ్డి వట్‌పల్లి మండల పరిధిలోని కేరుర్ గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున రోడ్డుపైకి భారీ మొసలి వచ్చింది. డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం..

కేరుర్ గ్రామంలో రహదారిపైకి మొసలి వచ్చిందన్న సమాచారం గ్రామస్థులు ఇచ్చినట్లు తెలిపారు. తమ సిబ్బంది, ఎస్సై లవకుమార్‌తో కలిసి దాన్ని సురక్షితంగా బంధించి కల్పగురులోని మొసల సంరక్షణ కేంద్రంలో విడిచిపెట్టినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ సత్యనారాయణ బేస్ క్యాంప్ సిబ్బంది రఘుపతి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు మృతి



ఇమ్మడి నర్సింలు (ఫైల్)

హవేళీఘణపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో రైతు మృతి చెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జక్కన్నపేట గ్రామానికి చెందిన ఇమ్మడి నర్సింలు (45) తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయం చేస్తూ, కూలి పనులు కూడా చేస్తూ జీవిస్తున్నాడు. నర్సింలు కొత్త ఇల్లు నిర్మంచుకున్నాడు. ఈ ఇంటి నిర్మాణం కోసం రూ. ఐదు లక్షల అప్పు అయింది. వ్యవసాయ అప్పు తీర్చలేనని హైద్రాబాద్ వలస వెళ్లి కూలి పపనులు చేస్తున్నాడు. పంట డబ్బులు అప్పులు తీర్చేంతగా రాకపోవడంతో తీవ్ర మనోవేదన చెందుతుండేవాడు. శుక్రవారం స్వగ్రామాని వచ్చాడు. రాత్రి కుటుంబీకులు అందరు అన్నం తిని పడుకున్నారు. ఉదయం లేచి చూసేసరికి హాలులో ఉన్న ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు ఉన్నారు. నర్సింలు భార్య పద్మ ఫిర్యాదుతో మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం మెదక్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరిలించినట్లు ఎసై నరేష్ తెలిపారు.

రగ్బీ పోటీల్లో జాతీయస్థాయిలో ప్రతిభ



జాతీయ స్థాయికి ఎంపికైన గాయత్రి

చేగుంట , డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ డోర్నకల్‌లో డిసెంబరు 30 న జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గాయత్రి జాతీయస్థాయిలో ఎంపికయిందని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శారద తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థిని మండల విద్యాధికారి నీరజ, పాఠశాల పీడీ శారద, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం పట్టివేత, కేసు నమోదు

కల్హేర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కల్హేర్‌లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకుని కేసు నమోదు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్సై రవిగౌడ్ శనివారం తెలిపారు.

స్థానిక బీసీ కమ్యూనిటీ భవన సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులో మద్యం విక్రయాలు జరుపుతుండగా తాము దాడి చేశామని, ఆ సమయంలో అందులో ఉన్న వివిధ రకాల బ్రాండ్‌లకు చెందిన 27 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న హన్మాగౌడ్‌పై కేసు నమోదు చేశామని, ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రవిగౌడ్ హెచ్చరించారు.

రక్షణ చర్యలు ఏవీ

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మంగమ్మ తోటలో 3 కేవీ విద్యుత్ వైర్లు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది కనీసం రక్షణ కోసం తలకు హెల్మెట్ చేతులకు గ్లౌజులు కాళ్లకు బూట్లు లేకుండానే ఇలా ప్రమాద కరంగా పైకి ఎక్కి మరమ్మతు లు చేస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న సిబ్బంది ప్రాణాలకే ప్రమాదం అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

-సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటో గ్రాఫర్





మంగమ్మతోటలో రక్షణ లేకుండా మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆరుగురిపై కేసు నమోదు

- మూడు ద్విచక్ర వాహనాలు, 2 కార్లు సీజ్

మద్దూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి మద్యం తాగుతున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ అధికారులతో పాటు మద్దూరు పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన ధూళిమిట్ట మండలంలోని తోర్నాల గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ విషయమై ఎస్సై షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. తోర్నాల గ్రామంలో ఓ ఇంట్లో కొంత మంది మద్యం తాగుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులతో పాటు మద్దూరు పోలీసులు వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. 6 గురిపై కేసు నమోదు చేసి వీరి వద్ద నుంచి 3 ద్విచక్రవాహనాలు, 2 కార్లు స్వాదీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

మట్టి తవ్వకాలకు తాత్కాలిక అనుమతి

జిన్నారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిన్నారంలో ప్రైవేట్ పరిశ్రమ భూమి నుంచి మట్టి తవ్వకాలకు తాత్కాలిక అనుమతి ఇచ్చినట్లు గనులు, భూగర్భ శాఖ జిల్లా కార్యాలయం అధికారులు తెలియజేశారు. ఈనెల 1న జిన్నారంలో జోరుగా మట్టి దందా పేరున 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు వివరణ ఇచ్చారు. స్థానికంగా ఉన్న ప్రైవేట్ పరిశ్రమ నుంచి మట్టి తవ్వకాలకు తాత్కాలిక అనుమతులు ఇచ్చామని, ఆన్‌లైన్‌లో టాక్స్, ఇతర పన్నులు చెల్లించారని తెలిపారు. కాగా రెవెన్యూ, పోలీస్‌శాఖల సమన్వయంతో అక్రమ మట్టి తరలింపులపై నిఘా ఏర్పాటు చేశామని మైనింగ్ శాఖ కార్యాలయం సహాయ సంచాలకుడు రఘుబాబు తెలియజేశారు.

వాహనాల తనిఖీ



వాహనాలకు తనిఖీ చేస్తున్న అధికారులు

వెల్దుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా శనివారం వెల్దుర్తి నుంచి చర్లపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ఎఫ్ఎస్‌టీ అధికారులు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రూ.50 వేలు మాత్రమే ఉండాలని, అంతకంటే ఎక్కువగా ఉంటే స్వాధీనం చేసుకుంటామన్నారు. అలాగే ఏఎస్ఐ గాలయ్య ఆధ్వర్యంలో శనివారం అల్లాదుర్గంలో ఎఫ్ఎస్‌టీ టీం వాహనాల తనిఖీ చేపట్టారు.

అధిక మద్యం ప్రాణం తీసింది

దుబ్బాక, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి అధిక మద్యం తాగడంతో ప్రాణాలు పోయిన సంఘటన దుబ్బాక పట్టణంలో జరిగింది. శనివారం దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణానికి చెందిన చెక్కపల్లి సుధాకర్(45) వ్యవసాయం, కూలి పనులు చేసేవాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం ఉదయం వ్యవసాయ పొలంలో గడ్డి మందు కొట్టేందుకు కుమారుడితో వెళ్లి, ఇంటికి తిరిగి వచ్చాడు. అనంతరం బయటకు వెళ్తున్నానంటూ వెళ్లి పట్టణంలోని ఒక బార్ అండ్ రెస్టారెంట్లో అధికంగా మద్యం తాగి, అక్కడే కిందపడ్డాడు. దీంతో కొంతమంది స్థానికులు అతన్ని ఆటోలో ఇంటికి తీసుకువచ్చి పడుకోబెట్టారు. కొంత సమయం తర్వాత భార్య అతడిని లేపినా లేవకపోవడంతో, కంగారుపడి దుబ్బాక 100 పడకల ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి సుధాకర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణానికి చెందిన కడారి కృష్ణ(35) గజ్వేల్‌లోని విక్టరీ బార్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు బార్‌లో ఎందుకు పని చేస్తున్నావు వేరే పని చేసుకోవచ్చు కదా అని మందలించడంతో ఆవేశంలో శుక్రవారం క్రిమిసంహారక మందు సేవించాడని 108 సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో సిబ్బంది కృష్ణను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.



బ్యాలెట్ బాక్స్‌లొచ్చాయ్..!

తొగుట మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఎంపీడీవో కార్యాలయానికి శనివారం 182 బ్యాలెట్ బాక్స్‌లను అధికారులు తరలించారు. వాటిని గ్రామ పంచాయతీ సిబ్బందితో ఎంపీడీవో నాగేశ్వర్ కార్యాలయంలో భద్రపరిచారు.

- తొగుట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి)



ఉపసంహరించుకోలేక టూర్‌కు..

- ఇతర అభ్యర్థులకు మరో పార్టీ నేతల ఫోన్ కాల్స్
- సమాధానం ఇవ్వలేక టూర్ బాట పట్టిన సర్పంచ్, వార్డుల అభ్యర్థులు
- ఉపంసహరణ గడువు ముగియడంతో స్వగ్రామాలకు చేరుకున్న వైనం

మునిపల్లి, డిసెంబర్6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొన్ని గ్రామాల్లో ఓ పార్టీకి చెందిన నేతలు ఇతర అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణకు తీవ్రమైన ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా ఓ పార్టీ మద్దతు అభ్యర్థులకు ఫోన్‌కాల్స్ చేసి ఒత్తిడి పెంచినట్లు సమాచారం. కొందరు నాయకులు బెదిరింపులకూ పాల్పడడంతో పలువురు అభ్యర్థులు తలొగ్గలేకకకక టూర్‌కు పేరుతో అందుబాటులో లేకుండా జాగ్రత్త పడినట్లు తెలిసింది. ఓ గ్రామ బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి, వార్డుల అభ్యర్థులు రెండు రోజులుగా టూర్‌కు వెళ్లడం గమనార్హం. ఈ నెల 6న ఉపసంహరణ గడువు ముగియడంతో సాయంత్రం తిరిగి స్వగ్రామానికి చేరుకున్నారు.



బీజేపీ, కాంగ్రెస్ మద్దతు అభ్యర్థుల మిలాఖత్

- ఒకరు నామినేషన్ ఉపసంహరణ
- ముక్కున వేలేసుకున్న కార్యకర్తలు

తొగుట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలంలో సర్పంచ్ ఎన్నికల వేడి రోజురోజుకు రాజుకుంటోంది. నిన్నటివరకు తుక్కాపూర్ గ్రామంలో నువ్వా, నేనా అన్నట్లు ప్రత్యర్థులుగా తలపడిన బీజేపీ, కాంగ్రెస్ మద్దతు గల సర్పంచ్ అభ్యర్థుల మధ్య సయోధ్య కుదరడంతో రాత్రికి రాత్రే ఒక్కటయ్యారు. దాంతో బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థి చిక్కుడు లక్ష్మి చంద్రం ముదిరాజ్ తన నామినేషన్‌ను శనివారం విత్‌డ్రా చేసుకుని కాంగ్రెస్ అభ్యర్థి చిక్కుడు (మాష్టి) కళావతి స్వామి ముదిరాజ్‌కు మద్దతు పలికారు. దాంతో నిన్న మొన్నటి వరకు వెంట తిరిగిన కార్యకర్తలు ఔరా అంటూ ముక్కున వేలేసుకున్నారు.

ప్రింటింగ్ ప్రెస్‌ల వద్ద సందడి..



చేగుంటలో ప్రింటింగ్ ప్రెస్ వద్ద గుమిగూడిన అభ్యర్థులు

చేగుంట ,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో చేగుంట మండల కేంద్రంలో ప్రింటింగ్ ప్రెస్, జనరల్ స్టోర్‌లు సందడిగా మారాయి. కరపత్రాలు ముద్రించేందుకు, గుర్తుల కొనుగులుకు అభ్యర్థులు బారులు తీరారు. ఇదిలా ఉండగా చేగుంట మండలంలోని 25 గ్రామ పంచాయతీల గాను నామినేషన్ల ఉపసంహరణకు శనివారం గడువు ముగిసింది. అయితే అభ్యర్థులు గుర్తుల కోసం సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వచ్చింది. అధికారులు కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన నోటీస్ బోర్డ్‌లకు అతికిస్తారని ఆశతో ఎదురు చూడగా.. ఆలస్యం కావడంతో సిబ్బందిచే వారి వారి గ్రామాల నామినేషన్ కౌంటర్ల వద్ద గుర్తులను చదివి వినిపించారు. దీనిపై అభ్యర్థులు అసహనం వ్యక్తం చేశారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ..

- 28 జీపీలకు బరిలో 91 మంది అభ్యర్థులు

చిన్నశంకరంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికల ఉపసంహరణ శనివారం ముగిసింది. 31 గ్రామ పంచాయతీల్లో గవ్వలపల్లితండా, టీ మాందాపూర్ తండా, సంగాయిపల్లి సర్పంచ్ స్థానాలు, 70 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 28 జీపీలకు ఎన్నికలు జరుగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 91 సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. సర్పంచ్, వార్డుల అభ్యర్థుల గుర్తులు కేటాయించడంతో గ్రామాల్లో ప్రచారం జోరందుకుంది.



నాగసానిపల్లి నాలుగోవార్డుకు నో నామినేషన్

మాసాయిపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగసానిపల్లి నాలుగో వార్డుకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఈ వార్డులో 51 మంది బీసీ ఓటర్లు ఉన్నారు. అయినప్పటికీ రోస్టర్ విధానంలో ఎస్సీ మహిళకు కేటాయించడంతో బీసీలెవరూ నామినేషన్ వేసేందుకు వీలులేకుండా పోయింది. ఈ విషయమై కలెక్టర్‌కు సమాచారం అందించినట్లు ఎంపీడీవో విగ్నేశ్వర్ తెలిపారు.

కుల సంఘాల కటాక్షం కోసం యత్నం..

- గ్రామ పెద్దలు, సంఘాల నేతలతో నిత్యం సంప్రదింపులు
- కమ్యూనిటీకి అవసరమైన సామగ్రి కొనిస్తామని హామీ
- నారాయణఖేడ్ నియోజకవర్గంలో పలు గ్రామాలు ఏకగ్రీవం

నారాయణఖేడ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో ఎలాగైన గెలుపొందాలనే ఆలోచనతో పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రామాల్లో ప్రధానంగా కులసంఘాల ప్రభావం అధికంగా ఉంటుంది. దీంతో అభ్యర్థులు కులసంఘాలను మచ్చిక కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ పెద్దలు, కుల సంఘాల బాద్యులతో సంప్రదింపులు జరుపుతున్నారు. కమ్యూనిటీ సామూహిక అవసరాలకు ఉపయోగపడే వంట పాత్రలు, మైక్‌సెట్‌లు, సమావేశాలకు అవసరమయ్యే కుర్చీలు, టెంట్లు, తదితర సామాగ్రి ఇప్పించేందుకు అభ్యర్థులు ముందుకు వస్తున్నారు.

పలు గ్రామాలు ఏకగ్రీవం..

నారాయణఖేడ్ నియోజకవర్గంలో 223 గ్రామపంచాయతీలు ఉండగా, ఇందులో 52 గిరిజన తండా పంచాయతీలే ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు తండాల పంచాయతీలే ఏకగ్రీవమయ్యాయి. పెద్దశంకరంపేట మండలంలోని ఇసుకపాయల తండాకు చెందిన కవిత, గట్టుకింది తండాకు చెందిన మనోవత్‌రాజుతో పాటు ఇతర సామాజిక వర్గానికి చెందిన కొత్తపేటకు చెందిన తంబిగారి పోచమ్మ, మాడ్చేట్‌పల్లికి చెందిన రాజ్‌కుమార్, సంగారెడ్డిపేటకు చెందిన బాలమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని నిజాంపేట మండలం బల్కంచెల్కతండాకు చెందిన మూడ్ సరిత, నాగన్‌కుంట తండాకు చెందిన దేవసోత్ సాలిబాయి, నారాయణఖేడ్ మండలం శేరి తండాకు చెందిన హిరామన్‌నాయక్, అల్లాపూర్‌కు చెందిన కమలానాయక్, కంగ్టి మండలం చందర్‌తండాకు చెందిన శాంతాబాయి, కల్హేర్ మండలం జమ్లాతండాకు చెందిన గోవింద్‌నాయక్, సిర్గాపూర్ మండలం లక్ష్మణ్‌నాయక్ తండా కూడా ఏకగ్రీవమైంది. వీరందరూ కాంగ్రెస్ మద్దతుదారులే కావడం గమనార్హం. ఏకగ్రీవమైన పంచాయతీల్లో 9 గిరిజన తండాలే.

మొదటి సారి ఎన్నికల్లోనే...

నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఏడు కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. కాగా పెద్దశంకరంపేట మండలంలోని గట్టుకిందితండాలో మొదటిసారి ఎన్నికల్లోనే ఏకగ్రీవమైంది. మనోవత్‌రాజును సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉద్యోగాలు వదలి ఎన్ని'కల' బాట

చేర్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చేర్యాల మండలానికి చెందిన పలువురు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎన్ని'కల' బాట పట్టారు. తాడూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ నల్లా అనిత, ముస్త్యాల గ్రామానికి చెందిన ఐకేపీ సీఏ బండకింది నవిత తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనిత ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేయగా, బండకింది నవితకు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలికింది. అలాగే చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో మరో విద్యావంతురాలు రమణ బరిలో నిలిచారు.

పోతిరెడ్డిపల్లిలో భార్యభర్తలు నామినేషన్ల దాఖలు..

చేర్యాల మండలం పోతి రెడ్డిపల్లి గ్రామంలో ఆయా కుల సంఘాలు, గ్రామపెద్దలంతా కొద్దిరోజులపాటు చర్చలు కొనసాగించి ఏకగ్రీవం ప్రయత్నించినప్పటికీ శుక్రవారం పలువురు నామినేషన్లు దాఖలు చేయడంతో ఆశలు అడియాశలయ్యాయి. ఆదినుంచి సర్పంచ్ గిరి ఆశిస్తున్న మల్యాల వేణుమోహన్ బరిలో నిలిచేందుకు పావులు కదుపుతున్నాడు. అనూహ్య కారణాల వలన తన నామినేషన్ తిరస్కరణకు గురైతే పోటీలో నిలబడటంకోసం తన సతీమణి పుష్పలతతో కూడా నామినేషన్ వేయించాడు. గ్రామపెద్దలు ఏకగ్రీవంం కోసం బుజ్జగించి ఇతరుల నామినేషన్ల ఉపసంహరణ వైపు మొగ్గుచూపుతుండటంతో అందరిదృష్టి పోతిరెడ్డిపల్లి వైపు మళ్లింది.

ఇక్కడ మొదటిసారి పంచాయతీ ఎన్నికలు

కోహీర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని రెండు గ్రామపంచాయతీలో మొదటిసారి పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఇదివరకు కోహీర్ మండలంలోని పీచేర్యాగడి పాతతండా గతంలో పీచేర్యాగడి గ్రామపంచాయతీ పరిధిలో ఉండేది. మరో గ్రామం కొత్తూరు (కే) ఖానాపూర్ గ్రామ పరిధిలో ఉండేది. 2018 నవంబరులో మండలంలోని కొత్తూరు (కే), పీచేర్యాగడి పాత తండా, కొత్తూరు(డి), సిద్దాపూర్ తండాలను ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా మార్చారు. 2019 జనవరిలో అప్పటి ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. దీంతో కొత్తూరు (డి) సిద్దాపూర్ గ్రామాల్లో సర్పంచులు ఎన్నికలు జరగగా, పీచేర్యాగడి పాత తండా, కొత్తూరు(కే) ఏకగ్రీవం కావడంతో ఎన్నికలు జరగలేదు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాల నుంచి పలువురు అభ్యర్థులు బరిలో నిలువడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. మొదటిసారి ఓటు ద్వారా తమ గ్రామ పరిపాలన ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవడం తమకు సంతోషంగా ఉందని ఆ గ్రామాల ఓటర్లు సంతోషం వ్యక్తం చేశారు.

సర్పంచ్‌ల వేలం ప్రజాస్వామ్య విరుద్ధం

- కేంద్రం ఇచ్చే రూ.3,500 కోట్ల కోసమే ఎన్నికలు
- బీజేపీ మద్దతు అభ్యర్థులను గెలిపిస్తే రూ.25లక్షలు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్/సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవం కోసం వేలం పాటలు నిర్వహించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. మెదక్, సిద్దిపేట పట్టణాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సర్పంచ్, వార్డు సభ్యులను ఓటు ద్వారా ఎన్నుకోవాలన్నారు. ప్రజలను మభ్యపెట్టి వేలం పాటలు నిర్వహించి రూ. లక్షల్లో చెల్లించి సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేస్తున్నామని చెప్పుకోవడం మంచిది కాదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పైసలు లేవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారని ఆయన గుర్తుచేశారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. రెండేళ్లుగా ఎమ్మెల్యేలకు నియోజకవర్గ నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.3500 కోట్ల నిధుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు జరుపుతున్నదని అన్నారు. మెదక్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్నా అభివృద్ధి పనులు చేయలేకపోతున్నారని, ఇలాంటి పరిస్థితిలో బీఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్‌లుగా గెలిచేవారు ఎలా అభివృద్ధి చేయగలుగుతారని ప్రశ్నించారు. గ్రామాలకు నిధులు రావాలంటే కేంద్ర ప్రభుత్వం ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. ప్రతీ గ్రామానికి నేరుగా కేంద్ర ప్రభుత్వం నుంచే నిధులు వస్తున్నాయని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

తాను ఎంపీగా గెలిచిన ఏడాదిలోనే రూ.5 కోట్ల నిధుల్లో 65 శాతం సిద్దిపేట ప్రాంతానికి ఖర్చు చేశానని తెలిపారు. పనులు తాను చేస్తుంటే ఓ పార్టీ నాయకులు క్షీరాభిషేకాలు చేయించుకున్నారని విమర్శించారు. చిన్నకోడూరు మండలంలో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు కృషి చేశానని, ప్రతీ నియోజకవర్గానికి అంబులెన్స్ మంజూరు చేయించానని చెప్పారు. బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే రూ. 25లక్షల నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

'మనీ'ఫెస్టో..!

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు.
- అల్లాదుర్గం గ్రామంలో ఆడపిల్ల పుడితే రూ.5వేలు, పేద ఇళ్లలో అమ్మాయి వివాహానికి ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇస్తున్నారు.
- కంది మండలంలోని పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామని అభ్యర్థులు చెబుతున్నారు.
- శివ్వంపేట మండలం గేమ్‌సింగ్ నాయక్‌తండాలో సేవాలాల్‌మహరాజ్ ఆలయానికి రూ.6లక్షలు ఇస్తానని హామీ ఇచ్చిన అభ్యర్థి వైపే ప్రజలు మొగ్గుచూపారు.
- కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి భర్త.. తన భార్యను గెలిపిస్తే ఐదేళ్లపాటు ప్రతీ రోజు ఉచితంగా వాటర్‌క్యాన్‌ను పంపిణీ చేస్తానని, వైకుంఠ రథం అందజేస్తానని హామీ ఇచ్చారు.
- అందోల్ మండలం నేరడిగుంటలో ఓ అభ్యర్థి మేనిఫెస్టో తయారు ప్రకటించి సొంత డబ్బులతోనే పనులు చేయిస్తానని ఓట్లు అభ్యర్థిస్తున్నారు.
- కుకునూరుపల్లి మండలంలో దుర్గమ్మ, పెద్దమ్మ ఆలయాలకు స్థలాలు ఇవ్వడమేకాకుండా ఆర్థిక సహాయమూ చేస్తామని ఒకరు హామీ ఇస్తున్నారు.
- వర్గల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆడపిల్లల వివాహానికి పుస్తెమట్టెలు అందిస్తామంటున్నారు.
- నాగల్‌గిద్ద మండలం ముక్తాపూర్ సర్పంచ్ అభ్యర్థి నెలకు రూపాయే జీతం తీసుకుంటానని రాసిచ్చాడు.
- ములుగు మండలం గంగాధర్‌పల్లి సర్పంచ్ అభ్యర్థి తనను గెలిపిస్తే ఆడపిల్ల పెళ్లికి ఫంక్షన్‌హాల్ డబ్బులు ఇస్తానని, ఆడపిల్ల పుడితే రూ.5వేలు స్తానని హామీ ఇస్తున్నాడు.
- పాపన్నపేట మండలం మిన్‌పూర్ గ్రామంలో ఓ మహిళా సర్పంచ్ అభ్యర్థి ఎలాంటి ఖర్చులు లేకుండా పెద్దమనుషుల పంచాయితీలు చేయిస్తానని పోస్టర్ ముద్రించి ప్రచారం చేస్తున్నారు.

అభివృద్ధి గురించి అంతంతే..

గ్రామాల అభివృద్ధి గురించి అభ్యర్థులు పెద్దగా ప్రస్తావించడం లేదు. ప్రచారంలో కొత్తదనాన్ని వెతుకుతున్నారు. ఉచిత హామీలు ఇస్తున్నారు. ఎలాగూ చేయాల్సిన పనులే కాకుండా కొత్తగా ఏం చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

మునిపల్లి మండలంలో 22మంది వార్డులు..

మునిపల్లి, డిసెంబర్6 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా 30గ్రామ పంచాయతీలకు 122 మంది సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు కాగా ఇందులో 43మంది సర్పంచ్ అభ్యర్థులు విత్ డ్రా చేసుకున్నారు. మిగతా 79మంది సర్పంచు అభ్యర్థులు బరిలో ఉన్నారు. మండల వ్యాప్తంగా 262 వార్డు స్థానాలకు 512మంది నామినేషన్లు దాఖలు కాగా ఇందులో 19మంది విత్‌డ్రా చేసుకోగా 22మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గార్లపల్లిలో 5, చిన్నలోనిలో 6, బొడశట్‌పల్లిలో 1, హైద్లాపూర్‌లో 2, పోల్కంపల్లిలో 2, గొర్రెగట్టులో 1, మన్నన్‌పల్లిలో 2, బోడపల్లిలో 3 వార్డు సభ్యులు ఏకగ్రీమవగా.. 238వార్డులకు ఎన్నికలు జరుగనున్నట్లు ఎంపీడీవో హరినందన్ రావు తెలిపారు. కాగా, పెద్దచెల్మెడలో 4వ వార్డు ఎస్టీ రిజర్వేషన్ రావడంతో ఒక్క నామినేషన్‌నూ దాఖలు కాలేదు.

ఓటు పడకుండానే..

ఉమ్మడి జిల్లాలో ఏకగ్రీవాల జాతర

- పలు జీపీలు, వార్డుల్లో ఒక్కో నామినేషన్ దాఖలుతో ఏకగ్రీవ ఎన్నికకు లైన్ క్లియర్
- అభ్యర్థుల ఉపసంహరణతో మరికొన్ని..
- గ్రామాల్లో పండగ వాతావరణం



చిన్నకోడూరు మండలం రామంచ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన భవాని నవీన్

పుల్‌కల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పుల్కల్ మండలంలో నాలుగు గ్రామ పంచాయతీలు 31 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్ల ఉప సంహరణ గడువు శనివారం ముగియడంతో పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పుల్కల్ మండలం లక్ష్మీసాగర్ సర్పంచ్, 8 వార్డులు, లాల్‌సింగ్‌నాయక్‌తండా సర్పంచ్, 8 వార్డులు, మిన్‌పూర్ తండా సర్పంచ్, 6 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. వీటితో పాటుగా చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి పంచాయతీ సర్పంచ్ పదవితో పాటు మూడు వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన మరో మూడు వార్డులకు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. లక్ష్మీసాగర్ సర్పంచ్‌గా ఉప్పరి లక్ష్మణ్, లాల్‌సింగ్‌నాయక్ తండా సర్పంచ్‌గా రమావత్ లక్ష్మీబాయి, మిన్‌పూర్ తండా సర్పంచ్‌గా రమావత్ యమునశంకర్‌నాయక్, సరాఫ్‌పల్లి సర్పంచ్‌గా నందికంటి రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చందర్ తండా సర్పంచ్ ఏకగ్రీవం..

కంగ్టి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కంగ్టి మండల పరిధిలోని చందర్ తండా సర్పంచుగా జాదవ్ శాంతాబాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నామినేషన్‌ల దాఖలు గడువు ముగిసే సరికి కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి శాంతాబాయి ఒక్కరే నామినేషన్ వేశారు. పంచాయతీలోని ఆరు వార్డులు సైతం ఏకగ్రీవమయ్యాయి.

పీర్లతండా సర్పంచ్.. 8 మంది వార్డులు..

నారాయణఖేడ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మండలం అబ్బెంద పీర్లతండా సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం కానున్నది. పాత్‌లోత్ సాలిబాయి నామినేషన్, ఆమె మనువడు మనువడు పాత్‌లోత్ సచిన్ నామినేషన్ వేశారు. నామినేషన్ సక్రమంగా ఉండక పోతే ఇబ్బంది తలెత్తుతుందన్న ఉద్దేశంతో ముందు జాగ్రత్తగా మనువడితోనూ నామినేషన్ వేయించారు. ఈ మేరకు శనివారం నామినేషన్ల పరిశీలన పూర్తి కాగా.. ఇరువురివీ సక్రమంగానే ఉన్నాయి. దీంతో సచిన్ ఈ నెల 9న నామినేషన్ ఉపసంహరించుకోనుండగా, సాలిబాయి ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఇక్కడుతున్న 8 వార్డుల్లోనూ ఒక్కో నామినేషన్ వేయడంతో అన్నీ ఏకగ్రీవం కానున్నాయి. ఈ నెల 9న అధికారికంగా ప్రకటించనున్నారు. సాలిబాయి భర్త జీవ్లనాయక్ అబ్బెంద వార్డు సభ్యుడిగా, 1987లో నారాయణఖేడ్ ఎంపీపీగా, 2013లో అబ్బెంద సర్పంచుగా పని చేయడమే కాకుండా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగాను పోటి చేసి ఓడిపోయారు. ఆయన కుమారుడు సుధాకర్‌నాయక్ ఐఆర్ఎస్ అధికారిగా ముంబైలో విధులు నిర్వహిస్తున్నారు.

ఎర్రగుంట తండా ..

నర్సాపూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం ఎర్రగుంటతండా నుంచి సర్పంచ్‌గా మాజీ ఎంపీపీ జ్యోతినాయక్ భర్త సురేష్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికకానున్నాడు. ఇక్కడ ఆయనొక్కడే రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఆదివారం ఒక నామినేషన్ల ఉపసంహరించుకోనుండగా ఎన్నిక ఏకగ్రీవం కానున్నది. కాంగ్రెస్ మద్దతుతో బరిలో ఉండాలని అనుకున్న సురేష్‌నాయక్.. తండా పెద్దలతో అందరితో సంప్రదించి అభివృద్ధికి కృషి చేస్తాని హామీచ్చి పోటీగా ఎవరూ బరిలో నిలువకుండా ప్రయత్నించి సఫలమయ్యాడు.

బెల్లాపూర్‌లో ఎనిమిది వార్డులు..

మనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మనూరు మండల పరిధిలోని బెల్లాపూర్ గ్రామ పంచాయతీలో ఎనిమిది వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 10 వార్డులుండగా, ఎనిమిది వార్డులకు ఒకే నామినేషన్ రావడంతో ఏకగ్రీవమయ్యాయి. సర్పంచ్‌లకు, మరో రెండు వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ముక్టాపూర్‌లో ఒక వార్డు ఏకగ్రీవమైనట్లు అధికారులు తెలిపారు.

కల్హేర్‌లో ఒకటి, సిర్గాపూర్‌లో రెండు..

కల్హేర్/సిర్గాపూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మూడో విడత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా శనివారం నామినేషన్ల పరిశీలన పూర్తయ్యింది. కల్హేర్ మండలంలో ఒకటి, సిర్గాపూర్ మండలంలో రెండు గ్రామ పంచాయతీల్లో ఒకే నామినేషన్లు దాఖలు కావడంతో ఏకగ్రీవం కానున్నాయి. కల్హేర్ మండలంలోని బీబీపేట జంలాతండాలో కడావత్ గోవింద్ నాయక్, సిర్గాపూర్ మండలంలోని అంతర్గాం పత్రేనాయక్‌తండాలో మంగూబాయిరఘునాయక్, కడ్పల్ లక్ష్మణ్ నాయక్‌తండాలో దూరిబాయి నామినేషన్ దాఖలు చేశారు. ఈ పంచాయితీల్లోని అన్ని వార్డులు ఏకగ్రీవమయ్యాయి.



శాంతాబాయి (చందర్‌తండా)



రామచంద్రారెడ్డి (సరాఫ్‌పల్లి)



సాలిబాయి (పీర్ల తండా)



ఓంసింగ్ (కొండారెడ్డిపల్లి)



బానోత్ గణేష్ (శంశిరెడ్డిపల్లి)



లంబాడి అరుణ (చర్లపల్లి)

జంగపల్లి, అల్మాస్‌పూర్..

మిరుదొడ్డి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం జంగపల్లి, అల్మాస్‌పూర్ సర్పంచులుగా లావణ్యనర్సింహరెడ్డి, పద్మమల్లేశంలను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయాగ్రామాల్లోని ఇతర అభ్యర్థుల నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైంది.

నర్సింహులపల్లి జీపీ...

బెజ్జంకి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి మండలంలోని నర్సింహులపల్లి గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. సర్పంచ్ స్థానం జనరల్ కాగా జెట్టి రమేశ్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇక్కడున్న 6 వార్డులకూ ఒక్కొక్క నామినేషన్ రావడంతో అవి కూడా ఏకగ్రీవమయ్యాయి.

రామంచ ..

చిన్నకోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలం రామంచ గ్రామ సర్పంచ్‌గా ఎర్ర భవానినవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ స్థానం ఎస్సీ జనరల్ రిజర్వు కాగా నలుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు ఉప సంహరించుకోవడంతో భవాని నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భవాని నవీన్‌ను గ్రామస్థులు సన్మానించారు.

కొండారెడ్డిపల్లితండా..

జోగిపేట రూరల్ , డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అందోల్ మండల పరిధిలోని కొండారెడ్డిపల్లితండా సర్పంచ్‌గా బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థి కేతావత్ ఓంసింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపసర్పంచ్‌గా కేతావత్ దేవి బాయి తో పాటు వార్డు సభ్యులూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో బీఆర్ఎస్ బోణి కొట్టడంతో ఆ పార్టీ శ్రేణులు గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు.

న్యూస్ బాక్స్

పలువురి బైండోవర్



డీటీ ఎదుట నేరుస్తులను బైండోవర్ చేస్తున్న పోలీసులు

మునిపల్లి/నర్సాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వివిధ కేసుల్లో ఉన్న పలువురిని పోలీసులు డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ ఎదుట బైండోవర్ చేశారు. నర్సాపూర్ మండలం గూడెంగడ్డలో పంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామంలో గొడవకు యత్నించి శాంతిభద్రతలకు విఘాతం కల్పించేందుకు చేసిన తొమ్మిది మందిని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

తెల్లాపూర్ ఆర్వోగా దయానంద్

రామచంద్రాపురం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ ఆర్వోగా ముత్తంగి కార్యదర్శిగా పనిచేసిన దయానంద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌చార్జి ఉప కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదాయం పెంచే విధంగా అసెస్‌మెంట్ చేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడతామని తెలిపారు.

తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు : ఎస్ఐ

నర్సాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఎవరైనా రెచ్చగొట్టే ప్రచారం, విబేధాలు సృష్టించే రీతిలో పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ విద్వేషపూరిత పోస్టులు, రెండు వర్గాల మధ్య గొడవలకు దారితీసే పోస్టులు, తప్పుడు వార్తలు అపవాదులు, అభ్యర్థులపై అసత్యప్రచారం పెట్టడం చట్టపరంగా నేరమని హెచ్చరించారు.

పంచాయతీ ఎన్నికలపై శిక్షణ

వెల్దుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులకు శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని రైతువేదికలో ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్ అంజాగౌడ్ శిక్షణ ఇచ్చారు. పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, ఓటర్లకు అనుమానాలు ఉన్నా నివృత్తి చేయాలన్నారు. సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలో బ్యాలెట్ పత్రాలను ఎలా ఉపయోగించాలనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీతారాం, వెల్దుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ఎంపీవో నవీన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ కన్నుమూత



జోగిరెడ్డి(ఫైల్)

పుల్‌కల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చౌటకూర్ గ్రామ మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి జోగిరెడ్డి(70) గుండెపోటుకు గురై మృతిచెందారు. తొమ్మిది రోజుల క్రితం ఇంట్లో ఉండగానే ఛాతిలో నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగానే గుండెపోటు రావడంతో మరణించారు. మృతుడికి భార్య ఉమ, కూతురు, కుమారుడు ఉన్నారు. 1986 నుంచి 91 వరకు చౌటకూర్ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మృతిపట్ల మంత్రి దామోదర రాజనరసింహ, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, ఎంపీపీ మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్ రెడ్డి వేర్వేరుగా సంతాపం తెలిపారు. అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో జరుగనున్నాయి.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో ఖాసీంబేగ్ అన్నారు. సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ సంగారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ అస్మిత్‌ఖేలక్ష ఇండియా జోనల్ సెలక్షన్ పోటీలు శనివారం నిర్వహించారు.

మహంకాళీ ఆలయంలో పూజలు

మిరుదొడ్డి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మిరుదొడ్డి మహంకాళీ ఆలయంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం 13వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అప్పుడలా.. ఇప్పు‘డీలా’

- అంతటా ఎన్నికల కోలాహలం
- మండలంలో కనిపించని లేని హడావిడి
- నాడు 28 ఎంపీటీసీ, 23 మంది సర్పంచులతో సందడి
- మున్సిపాలిటీగా మారి స్థానిక ఎన్నికలకు దూరం
- బొల్లారం గ్రేటర్‌లో విలీనంతో నాయకుల నిరుత్సాహం



ఎన్నికలు లేక నిర్మానుష్యంగా మారిన జిన్నారం ఎంపీపీ కార్యాలయం

జిన్నారం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గ్రామపంచాయతీల ఎన్నికల సందడి నెలకొన్న వేళ.. జిన్నారం మండలంలో మాత్రం మా ఎన్నికలు ఎప్పుడో అని రాజకీయ పార్టీలు, నాయకులు చూస్తున్నారు. గతంలో 28 మంది ఎంపీటీసీలు, 23 సర్పంచులతో హంగామా చేసిన చోట.. మున్సిపాలిటీగా మారడంతో పంచాయతీ పోరుకు దూరం కావటంతో మండలంలో రాజకీయ నిశ్శబ్దం నెలకొన్నది. ఇటీవల పలు గ్రామపంచాయతీల విలీనం, కొత్తగా రెండు మున్సిపాలిటీల ఏర్పాటైంది. ఇప్పటికే మున్సిపాలిటీగా ఉన్న బొల్లారం కాస్తా గ్రేటర్‌లో విలీనంతో అక్కడా నాయకులు డీలా పడ్డారు. దీంతో రెండేళ్లుగా స్థానిక సమరానికి నిరీక్షిస్తున్న నాయకులు మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఎప్పుడో అంటూ లోలోన మదనపడుతున్నారు.

జిన్నారంలో నిశ్శబ్దం

గతంలో పారిశ్రామిక మండలంగా ఏ ఎన్నికలు జరిగినా హంగు ఆర్భాటాలతో ప్రచారం, డబ్బుల ఖర్చు, ఎన్నికల పోరు రసవత్తరంగా ఉండేది. జిన్నారం మండలంలో పదవుల కోసం నాయకుల మధ్య పోటీ తీవ్రంగా ఉండేది. వార్డుసభ్యుడి స్థాయి నుంచి, సర్పంచ్, ఎంపీటీసీ వరకు లక్షలు, కోట్లు ఖర్చు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఆర్భాటం ఉన్నచోట మున్సిపల్ వ్యవస్థ అమలుతో జిన్నారం పంచాయతీ పాలనకు దూరమైంది. ముఖ్యంగా జిన్నారం, గడ్డపోతారం కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటుకాగా.. మున్సిపాలిటీగా ఉన్న బొల్లారం కాస్తా గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం అయ్యింది. మూడు స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి. దీంతో వివిధ పార్టీల నాయకులు తమ పార్టీ బలపరిచిన అభ్యర్థుల తరఫున ప్రచారానికి ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.

పట్టణం వెలవెల.. పల్లెలు కిటకిట

నారాయణఖేడ్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన అనంతరం నారాయణఖేడ్ జనాలు లేక వెలవెల పోతుండగా.. పల్లెలు జనాలతో కిటకిటలాడుతున్నాయి. నారాయణఖేడ్ మున్సిపాలిటీ కావడంతో ప్రస్తుతం ఎన్నికల వాతావరణం లేదు. నియోజకవర్గంలోని 8 మండలాలకు నారాయణఖేడ్ పట్టణం ప్రధాన కేంద్రం. ఖేడ్‌లో సాధారణంగా 25 వేల నుండి 30 వేల వరకు జనాలు నివసిస్తుంటారు. చుట్టుపక్కల మండలాలకు చెందిన దాదాపు 10 వేల మంది నారాయణఖేడ్‌లో తమ పిల్లల చదువులు, ఉపాధి, వ్యాపారం, తదితర అవసరాల కోసం నివాసముంటారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికలు కొనసాగుతుండడంతో ఇతర గ్రామాల వారు సొంత గ్రామాలకు మకాం మార్చారు. ఎన్నికల్లో పోటీ చేయడం కోసం, పోటీచేసేవారికి మద్దతు ఇవ్వడం కోసం సొంత గ్రామాలకు వెళ్లడంతో ఖేడ్ వెలవెలబోతుంది.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న శ్రీరాం

పాపన్నపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీరాం సూచించారు. శనివారం మండల పరిధి పొడ్చన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ల్యాబ్, మందుల గది, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. పలు రికార్డులు పరిశీలించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి హరిప్రసాద్, సూపర్‌వైజర్ అలీ, ఏఎన్ఎంలు, తదితరులున్నారు.

ఇస్మాయిల్‌ఖాన్‌పేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఫుట్‌బాల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించండి
- సర్పంచ్ అభ్యర్థి వడిగేపల్లి సౌజన్యరాజు



వడిగేపల్లి సౌజన్యరాజు, ఇస్మాయిల్ ఖాన్‌పేట సర్పంచ్ అభ్యర్థి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట(ఈశ్వరాపూరం)ను ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ బరిలో నిలిచిన వడిగేపల్లి సౌజన్యరాజు తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థులకు సమస్యలు లేకుండా చూస్తానని, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు ఉన్నత చదువులు చదివేందుకు ప్రోత్సహిస్తానన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులకు అవసరమయ్యే విద్యా కిట్లు (నోట్ బుక్కులు, పాఠ్యపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, జామెంట్రీ బాక్సులు ఇతర పరికరాలు) ఉచితంగా పంపిణీచేసి విద్యలో ప్రోత్సహిస్తామని వెల్లడించారు. గ్రామంలో ఉన్న అర్బన్ పీహెచ్‌సీ సెంటర్‌ను 30 పడకల ఆసుపత్రిగా మార్చి ప్రజలకు 24 గంటలు మెరుగైన సేవలందిస్తానని, ప్రతి మూడునెలలకోసారి ఉచిత వైద్య, బ్లడ్ టెస్టు శిబిరాలు ఏర్పాటు చేస్తానని హామీఇచ్చారు. అదేవిధంగా ప్రతి వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తానని, శాఖ గ్రంథాలయాన్ని డిజిటల్ లైబ్రరీగా మారుస్తానని భరోసా కల్పించారు. తనకు ఫుట్‌బాల్ గుర్తుపై ఓటువేసి గెలిపిస్తే.. పాలకురాలిగా కాకుండా సేవకురాలిగా ఉంటానని హామీఇస్తున్నారు.

అప్పుడు వారే.. ఇప్పుడూ వారే..!

- రెండోసారి పోటీలో ఇద్దరు మహిళలు
- సిర్గాపూర్ జంలాతండాలో విచిత్ర పోటీ



కాట్రోత్ దివ్యభారతి, విస్లావత్ పార్వతి

కల్హేర్/సిర్గాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని జంలాతండాలో విచిత్ర పోటీ నెలకొన్నది. 2019 గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసిన ఇద్దరు గిరిజన మహిళలు ప్రస్తుత ఎన్నికల్లోనూ తలపడుతున్నారు. దీంతో అందరి దృష్టి ఈ గ్రామపంచాయతీ ఫలితంపై పడింది. 2019 తండాకు 2019లో మొదటిసారిగా ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో కాట్రోత్ దివ్యభారతి, కాంగ్రెస్ మద్దతుతో విస్లావత్ పార్వతిలు పోటీచేశారు. ఈ ఎన్నికల్లో కాట్రోత్ దివ్యభారతి 99 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. జంలాతండా ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయినా మహిళలే బరిలో నిలవడం విశేషం. ప్రస్తుత ఎన్నికల్లోనూ వారే సర్పంచ్ అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. తండా ప్రజలు ఈసారి ఎవరిని గెలిపిస్తారో వేచిచూడాల్సిందే.

వార్షికోత్సవాలకు సహకారమందిస్తా : ఎమ్మెల్యే



జంగంపేట ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు/జిన్నారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మున్సిపాలిటీ జంగంపేటలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలకు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం జంగంపేట వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 15 ఎల్లమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవానికి రావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఆలయ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు శ్రీనివాసభార్గవలు ఆహ్వానించారు. అలాగే పటాన్‌చెరు పాలిటెక్నిల్ కళాశాలలో జేకే పెన్నార్, కిర్బీ పరిశ్రమల వారు అందించిన రూ.35 లక్షల విలువైన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు సర్వేష్ అమృత్, నాగరాజు, సీఐ వినాయకరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



ఉత్తులూరులో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని జూకల్, ఉత్తులూరు తదితర గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం జూకల్ గ్రామంలో బీఆర్ఎస్‌కు చెందిన 30 మంది కాంగ్రెస్‌లో చేరగా.. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు రాయిని మధు, తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల పరిష్కారం

- మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి



మాట్లాడుతున్న కవితాదేవి

జహీరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజీమార్గంతోనే కేసులను పరిష్కరించుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ ఖలీల్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బ్యాంకులు, చిట్ ఫండ్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వన్ టైం సెటిల్‌మెంట్ పద్ధతిలో ఖాతాదారులకు నచ్చజెప్పి రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు మాణెన్న, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని మాణిక్ ప్రభుత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డీఈవో



కిక్‌బాక్సింగ్‌ను ప్రారంభిస్తున్న డీఈవో, డీవైఎస్‌వో

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో ఖాసీంబేగ్ అన్నారు. సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ సంగారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ అస్మిత్‌ఖేలక్ష ఇండియా జోనల్ సెలక్షన్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డీఈవో వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో ఖాసీంబేగ్ హాజరై పోటీలు ప్రారంభించి మాట్లాడారు. రెండురోజుల పాటు నిర్వహించనున్న క్రీడల్లో అందరూ విజయం సాధించి మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ స్టేట్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్, కోశాధికారి శ్రీనివాస్, సంగారెడ్డి అధ్యక్షుడు పోచయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి

అంబేడ్కర్ వర్ధంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ఆయన చూపిన బాటలో నడుచుకోవాలని పలువురు సూచించారు.

- న్యూస్ నెట్‌వర్క్



మెదక్ అర్బన్ : గోల్గొండలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు



సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రభాకర్

ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

కొల్చారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం మండలంలో మూడో విడతలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు శనివారం ఏర్పాటుచేసిన శిక్షణకు జిల్లా విద్యాధికారి విజయ హాజరై మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని తెలిపారు. జిల్లా ఎన్నికల మాస్టర్ శిక్షకులు జిల్లా సైన్స్ అధికారి మాట్లాడుతూ పోలింగ్ రోజుకు ఒకరోజు ముందు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఉదయం 9 గంటలలోపు చేరుకుని సంబంధిత పోలింగ్ కేంద్రం మెటీరీయల్‌ను తీసుకుని చెక్ చేసుకోవాలని తెలిపారు. ఉదయం 7 పోలింగ్‌ను ప్రారంభించాలన్నారు. మధ్యాహ్నం 1 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌ను సీలు వేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మాస్టర్ శిక్షకులు వరప్రసాద్, మండల విద్యాధికారి సత్యనారాయణ రావులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు పదోన్నతి



ఎం.సత్యనారాయణ, పి.శైలజ

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నూతన చట్టాల ప్రకారం ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శైలజను డీడీపీపీ (డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్)గా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణ ఏడీడీఓపీ (అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్)గా నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

మునిపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శనివారం మండలంలోని లింగంపల్లి స్వతంత్ర అభ్యర్థి గోరేమియాతోపాటు పలువురు క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాలకు న్యాయం చేసేలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందించినట్లు ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఖమ్రోద్దీన్, నాయకులు ఇమ్రాన్‌పటేల్, వెంకటేశ్‌గౌడ్, అప్సర్, బక్కయ్య, మొగులయ్య, నర్సింహ, నజీర్, కలీం, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

నిజాంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాలను శనివారం ఆమె సందర్శించి నామినేషన్ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపులపై వివరించి మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో రాజిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ, ఇన్‌చార్జి ఎంపీవో నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఖమ్మంపల్లి కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాలను అందజేస్తున్న పైతర సాయికుమార్

మునిపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామ బీఆర్ఎస్ కమిటీని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ ప్రధాన కార్యదర్శిగా కలాల్ అనంతరామ్, ఉపాధ్యక్షుడిగా బుర్ర ఎల్లప్పలను నియమించారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి నరేష్‌కుమార్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కలాల్ యాదయ్యగౌడ్, నాయకులు కలాలి అంజయ్యగౌడ్. సురేష్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పారిశుధ్య లోపం



చెత్తా చెదారంతో నిండిన అస్పత్రి ఆవరణం

శివ్వంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చెత్తాచెదారంతో పారిశుధ్యం లోపించింది. దీంతో నిత్యం ఆసుపత్రికి వచ్చే ప్రజలకు కొత్త రోగాలు వచ్చే అవకాశం ఉన్నదని మండల ప్రజలు కోరుతున్నారు. శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ కొన్నినెలలుగా చెత్తాచెదారంతో నిండి అపరిశుభ్రంగా ఉన్నది. ఆస్పత్రి సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో చెత్త వేసే వాళ్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జగదేవ్‌పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పోలీసు అధికారులు చొరవ తీసుకొని అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా, రాత్రి వేళల్లో స్పీడ్ బ్రేకర్లు స్పష్టంగా కనిపించేలా వాటిపై తెలుపు రంగు వేశారు. దీని కోసం సహకరించిన కానిస్టేబుళ్లను ఎస్ఐ కృష్ణారెడ్డి అభినందించారు.